# కష్టేఫలీ



యఇచ్ఛే నదూర్ధ్వ గామిత్వం
పరం స్థానం చ శాశ్వతం
పద్మపత్రేషు భోక్తవ్యం
మాసమేకం నిరంతరం

*భావం:* ఎవరైనా పైకి రావాలని కోరుకున్నా శాశ్వతమైన పరలోకస్థానాన్ని ఆశించినా ఒక నెలపాటు తామరాకులో ప్రతిరోజూ భోజనం చెయ్యాలి.

రాజశేఖరశర్మ మహాపండితుడు. పరమనిష్టాగరిష్టుడు. మహాభక్తుడు. సొంత ఊరి లోనే కాక చుట్టు ప్రక్కల గ్రామాల్లో కూడా ఆయనకు మంచి పేరుండేది. రాజధానిలో చక్రవర్తి చేత సన్మానం పొందినవాడు.

పండితపుత్రః పరమ శుంఠః అన్నది లోకోక్తి. రాజశేఖరశర్మ కుమారుడు నిగమశర్మ పరమశుంఠ అయినా ఆయన అంత బాధపడేవాడు కాదేమో. నిగమశర్మ తెలివితేటలన్నీ అల్లరిచిల్లరిగా తిరగడంలోనే పనికి వచ్చేవి. మొదట్లో రాజశేఖరశర్మ ఇంట్లో తానే చదువు చెప్పడానికి ప్రయత్నించాడు. లాభం లేదని తెలిసి గురుకులానికి పంపించాడు.

తాచెడ్డ కోతి వనమెల్లా చెరిచినట్లు నిగమశర్మ గురుకులంలో ఇతర విద్యార్థులను కూడా తప్పుదారిలోకి మార్చడం మొదలెట్టాడు. గురుకులపతి నిగమశర్మను ఇంటికి పంపించివేశాడు.

నిగమశర్మకు పగలంతా జూదగృహంలో, రాత్రి పొద్దుపోయేవరకూ పానశాలలో సమయం గడిచిపోయేది. అర్ధరాత్రి ఇంటికి చేరిన వాడికి ఉదయం పది గంటలకు కూడా మెలుకువ వచ్చేది కాదు. రాజశేఖరశర్మ చివర ప్రయత్నంగా నిగమశర్మను తీసుకుని వెళ్ళి ఒక జ్యోతిష్కుని కలిసి జాతకం చూపించాడు. కుమారుడు వ్యసనపరుడయ్యాడనీ, జాతకంలో ఏదైనా గ్రహశాంతి అవసరమైతే చేయిస్తాననీ అన్నాడు.

జ్యోతిష్కుడికి శాస్త్రం లోనే కాక మానవ ప్రకృతిని చదవడంలో కూడా ప్రావీణ్యం ఉంది. ఆయన "అబ్బాయి జాతకం బ్రహ్మాండంగా ఉంది. ఐహికంగా పైకి రావడానికి కానీ ఆముష్మికానికి కానీ ఏ అడ్డూ లేదు. అయితే ఇవి సాధించడానికి నెలపాటు తామరాకులో భోంచెయ్యాలి" అన్నాడు. నిగమశర్మ ఎగిరిగంతేశాడు.

చదవక్కరలేకుండానే తన అలవాట్లు వదులుకోకుండానే పైకి వస్తే ఇంకేమి కావాలి అనుకున్నాడు.

జ్యోతిష్కుడు " తామరాకులు నువ్వే తెచ్చుకోవాలి" అన్నాడు.

రాజశేఖరశర్మ అనుమానంగా జ్యోతిష్కునికి కేసి చూసాడు. ఆయన ముఖంలో చిరునవ్వు భరోసా ఇచ్చినట్లుంది. నిగమశర్మ ఇంటికి వచ్చి ఆలోచించాడు. తామర తీగ ఊరి చివర దుర్గ ఆలయ ప్రాంగణంలోని చెరువు లోనే ఉంది. ఉదయం చాలామంది భక్తులు స్నానం చేస్తుంటారు. తాను తెల్లవారకముందే లేవాలి. ఆ ఊహ నచ్చకపోయినా నెలరోజులే కదా అనుకున్నాడు.

నిగమశర్మ ఉదయం కాక ముందే లేచి వెళ్ళి తామరాకు తెచ్చుకున్నాడు. ఉదయమే లేచి చెరువుమధ్యకు వెళ్ళి ఆకులు తెచ్చుకోవడంతో మధ్యాహ్నం అలసటగా అన్పించి జూదగృహానికి వెళ్ళలేకపోయాడు. తండ్రి శిష్యులకు చెప్తున్న పాఠం వద్దనుకున్నా విన్పించింది. సాయంత్రం తామరాకు తెచ్చుకుని భోజనం చేసేసరికి నిద్ర వచ్చేది. పానశాల దూరమైంది. నెల తిరిగేసరికి ఉదయం లేవడం, తండ్రి చెప్పే పాఠం వినడం, జూదానికీ, త్రాగుడికీ దూరంగా ఉండడం అలవాటయ్యాయి. మనస్సు చదువు మీదకు మళ్ళింది.

రాజశేఖరశర్మ కొడుకుతో సహా వెళ్ళి జ్యోతిష్కునికి కృతజ్ఞత తెల్పుకున్నాడు.

******